క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ సమ్మర్ కోచింగ్



క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు బుధవారంతో ముగిసింది. ఈ కోచింగ్‌లో పాల్గొని క్రికెట్‌లో శిక్షణ పొందిన వారికి స్థానిక ప్రముఖ కంటి వైద్యులు నర్సయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

ముగిసిన 'పది' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సాంఘిక శాస్త్రం పరీక్షలకు 42మందికి గాను 16మంది విద్యార్థులు హాజరుకాగా 26మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని డీఈవో యాదయ్య పరిశీలించారు.

బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఎస్సీ డీడీగా రాజేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్సీడీడీగా పనిచేసిన రవీందర్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. కరీంనగర్‌లో ఎస్సీ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి ఎస్సీ డీడీగా పదోన్నతిపై మంచిర్యాలకు వచ్చారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

శ్రీరాంపూర్: కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న ఉదయం 10 గంటలకు నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గూడ రాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు పెద్ద యెత్తున కేబుల్ ఆపరేటర్లు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

దండేపల్లి/భీమిని: భారత ప్రధాని నరేంద్ర మోదీ 11ఏళ్ల పాలన పూర్తయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దండేపల్లి మండలంలోని వెల్గనూర్, నంబాల, గూడెం, కన్నెపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు బుధవారం మొక్కలు నాటారు. కన్నెపల్లి మండలంలోని మాడవెల్లిలో కన్నెపలి మండల అధ్యక్షుడు మైదం ఆశన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొయ్యాల ఏమాజీ హాజరయ్యారు. పార్టీ ప్రవేశ పెడుతున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతం చేయాలని సూచించారు.

నేడు విద్యుత్‌లో అంతరాయం

చెన్నూర్: చెన్నూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పీజీటీ వృక్షశాస్త్రం, పీజీటీ జంతుశాస్త్రం, ఆంగ్లం, సంబంధిత సబ్జెక్టులలో పీజీ, బీఈడీ పూర్తిచేసిన వారు, తమ దరఖాస్తులను ఈ నెల 14లోపు లింగాపూర్ మోడల్ స్కూల్లో అందించాలని పేర్కొన్నారు.

నియామకం

జన్నారం: జిల్లా కేంద్రంలో అర్చక సదస్సు నిర్వహించారు. రాష్ట్రకమిటీ జేఏసీ ఆదేశాల ప్రకారం రాష్ట్ర దూపదీప నైవేద్య అర్చక సమైక్యా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన పెదంబుదూరి శ్రీకాంత్ స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.

పెంచిన బస్‌చార్జీలు తగ్గించాలి

బెల్లంపల్లి: పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలు వెంటనే తగ్గించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, సహాయకార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఆర్టీవో కార్యాలయం స్టాటికల్ అధికారి గురవయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. బస్‌చార్జీలు, విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు పెంచడం సరికాదన్నారు. ఆ పార్టీ శ్రేణులు రమేష్, రాజశేఖర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత



ఫోన్లు అప్పగిస్తున్న ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓ

బెల్లంపల్లి: పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు వెతికి పట్టుకుని బుధవారం బాధితులకు అప్పగించారు. బెల్లంపల్లి అసిస్టెంట్ పోలీసు కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య ఫోన్లను అందజేశారు.

ఏళ్ల కల.. నెరవేరనున్న వేళ..!

- విద్యార్థులు, ప్రజలకు తప్పనున్న తిప్పలు
- నేడు ప్రభుత్వ కళాశాల, జూలై 3న 30పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాలు ప్రారంభం
- అన్ని హంగులతో ఏర్పాట్లు
- ప్రైవేటుకు దీటుగా నిర్మాణాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం

లక్సెట్టిపేట: శిథిలావస్థలో ఉన్న భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పక్కా భవనాలకు మోక్షం లభించింది. రెండేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు ఎట్టకేలకు చివరి దశకు చేరాయి. ఎన్నో ఏళ్ల కళ నెరవేరబోతోంది. ప్రజల ఆరోగ్య సౌకర్యాల కోసం 30పడకల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కళాశాల భవనం సిద్ధం అయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి 8.5కోట్ల సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధులు, 30పడకల ప్రభుత్వాసుపత్రి కోసం 6.5కోట్లు ఎన్‌హెచ్‌ఎం నిధులు మంజూరయ్యాయి. కళాశాల భవనంలో రెండు అంతస్థులు, 12తరగతి గదులు, ల్యాబ్‌లు, స్టాఫ్ రూం, లైబ్రరీ, కంప్యూటర్ గది, సమావేశం గది, టాయిలెట్లు, కార్పొరేట్‌కు దీటుగా ఆధునిక పద్ధతిలో అన్ని హంగులతో నిర్మాణాన్ని చేపట్టారు. 30పడకల ప్రభుత్వాసుపత్రిలో రెండు అంతస్తులు, రెండు ఆపరేషన్ థియేటర్లు, డ్రెస్సింగ్ రూం, లేబర్ రూం, డాక్టర్స్ రూం, ఫార్మసీ, ఎక్స్‌రే, ల్యాబ్, ఓపీ కన్సల్టేషన్ గదులు, టాయిలెట్లు, క్యాజువాలిటీ గది, రికార్డు గది, మార్చురీ, కిచెన్, పేషెంట్ అటెండెన్స్ షెడ్ నిర్మించారు. కళాశాల భవనాన్ని ఈ నెల 12న విద్యార్థుల అకాడామిక్ సంవత్సరానికి ప్రారంభించేందుకు సిద్ధం చేయగా, జూలై 3న ఆసపత్రి భవనం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్ కోసం భవనం



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్సెట్టిపేట: విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం కళాశాల భవనాన్ని నిర్మాణం చేపట్టిందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణాన్ని బుధవారం పరిశీలించారు. నేడు కళాశాల భవనం ప్రారంభిస్తున్నామని, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కళాశాల భవనంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బదులు లేకుండా ఉండేందుకు కృషి చేస్తుందన్నారు. భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతున్నారన్నారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య, డీఈవో యాదయ్య, గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఈఈ అశోక్ పాల్గొన్నారు.

ఇబ్బందులు తీరినయ్..



ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి కావడం చాలా సంతోషంగా ఉంది. రేకుల షెడ్డులో విధులు నిర్వహిస్తూ చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నూతన భవనంలో రోగులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించారు. త్వరలోనే ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉంటది.

- శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్సెట్టిపేట

ప్రజల సౌకర్యం కోసమే...



ప్రజల సౌకర్యం కోసమే ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని విధాల సౌకర్యాలు కల్పించాం. రోగులకు, వైద్యులకు అన్ని మౌలిక సదుపాయాలున్నాయి. చాలా ఏళ్ల తరువాత పట్టణంలో రెండు పాత భవనాల కళ నెరవేరింది. నేను ఇదే కళాశాలలో చదువుకొని, భవనాన్ని నిర్మించినందుకు చాలా సంతోషంగా ఉంది.

- కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, ఎమ్మెల్యే

పచ్చిరొట్ట ఎరువుల వినియోగం మరింత పెంచాలి

- జిల్లా వ్యవసాయాధికారి కల్పన



విత్తనాల బ్యాగులు అందజేస్తున్న డీఏవో కల్పన

భీమారం: పంటలకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువుల వినియోగం మరింత పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన రైతులను సూచించారు. మండల కేంద్రంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాల బ్యాగులను బుధవారం డీఏవో రైతులకు పంపిణీ చేశారు. రసాయనిక ఎరువుల వినియోగం గణనీయంగా పెరుగుతుందని, దీనిని తగ్గించాల్సిన అవసరం ప్రతీ రైతుపై ఉందన్నారు. పచ్చిరొట్ట ఎరువులను తయారు చేసి పంటలకు ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తుందని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతులు వరి, పత్తి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు దుకాణంలో రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో అత్తె సుధాకర్, ఏఈవో అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

తాండూర్/చెన్నూర్‌రూరల్: జీలుగ(పచ్చిరొట్ట) విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెన్నూర్ ఏవో యామిని, తాండూర్ ఏవో సుష్మ తెలిపారు. 50శాతం సబ్సిడీతో వచ్చిన జీలుగ విత్తనాలను బుధవారం రైతులకు అందజేశారు. కావాల్సిన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ క్యాంపెయిన్



రక్త పరీక్షలకు వచ్చిన బస్తీవాసులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని బెల్లంపల్లి బస్తీ, సుభాష్‌నగర్ బస్తీలో బుధవారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ నిర్వహించారు. బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు బీపీ, షుగర్, హెచ్ఐవీ, సిఫిలిస్ తదితర రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇవాంజెలిన్, ఆర్‌బీఎస్‌కే టీమ్ డాక్టర్లు జుబేర్, రుక్మిణి, దిశ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నీలిమ, డెమో వెంకటేశ్వర్లు, మొబైల్ ఐసీటీసీ ల్యాబ్ టెక్నిషియన్ అలేఖ్య, కౌన్సిలర్ శ్రీలత, ఐసీటీసీ కౌన్సిలర్ జగన్, డీఈవో మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అటవీ అధికారుల దౌర్జన్యాలు ఆపాలి'



గిరిజనులతో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు సంకె రవి

వేమనపల్లి: మండలంలో రైతులు, ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ రైతు కూలీ సంఘం(ఏఐకేఎస్)జిల్లా అధ్యక్షుడు సంకె రవి అన్నారు. బుయ్యారంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయాల వల్ల రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు అడ్డుకుంటూ దౌర్జన్యాలు చేస్తూ భూములను లాక్కుంటున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, కేవీపీఎస్ నాయకులు మధుకర్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సబ్ మెరిసిబుల్ పంపు ప్రారంభం



పంపు ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని చత్లాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ మెరిసిబుల్ పంపును ఏరియా జీఎం దేవేందర్ బుధవారం ప్రారంభించారు. కేకే–1 నుంచి వచ్చే నీటిని శుభ్రం చేసి 350 హెచ్‌పీ సబ్ మెరిసిబుల్ పంపు ద్వారా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎస్ఈ (సివిల్) రాము, తదితరులు ఉన్నారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–5 గనిలో కొంత కాలంగా విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు గని ఆవరణలో మేనేజర్ శంభునాథ్ పాండే కౌన్సెలింగ్ నిర్వహించారు. నెలకు 16మస్టర్లు చేయాలని, లేకుంటే ఉద్యోగం పోయే ప్రమాదముందని హెచ్చరించారు. వెంటిలేషన్ అధికారి శంకర్, సంక్షేమాధికారిణి రవళి, ఆఫీస్ సూపరింటెండెంట్ సముద్రాల బుచ్చయ్య ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కాసిపేట: రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. మండలంలోని కోమటిచేనులో బుధవారం భూ భారతి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. రైతులు గ్రామసభల్లో హాజరై తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని, ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి ద్వారా ప్రయోజనం చేకూరుతుందన్నారు. దరఖాస్తులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఆర్ఐ కమల, సిబ్బంది ఉన్నారు.

అమ్మమాట-అంగన్‌వాడీ బాట



పద్దనపల్లిలో పాల్గొన్న డీఆర్‌డీవో కిషన్, సీడీపీవో



దండేపల్లి: గూడెంలో అక్షరాభ్యాసం



బెల్లంపల్లి: ర్యాలీ నిర్వహిస్తూ...

మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్/జన్నారం/దండేపల్లి/తాండూర్/పాతమంచిర్యాల/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు బెల్లంపల్లి, తాండూర్, దండేపల్లి, చెన్నూర్, జన్నారం, మందమర్రి, హాజీపూర్ మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు చిన్నారులు ర్యాలీలు తీసారు. మూడేళ్ల వయస్సు దాటిన చిన్నారులను తప్పక అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని నినాదాలు చేశారు. ఆ తర్వాత చిన్నారులకు ఎగ్ బిర్యాణితో భోజనం పెట్టారు. ఆయా కార్యక్రమాల్లో హాజీపూర్‌లో డీఆర్‌డీఓ కిషన్, ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, బెల్లంపల్లిలో సీడీపీవో స్వరూప, తాండూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, స్వరూపరాణి, దండేపల్లిలో లక్సెట్టిపేట సీడీపీవో రేష్మా, చెన్నూర్‌లో సూపర్‌వైజర్ మాధవి, జన్నారంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, మందమర్రిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.



తాండూర్: ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, చిన్నారులు



జన్నారం: కిష్టాపూర్‌లో...



జిల్లా కేంద్రంలో ర్యాలీ

గాలి దుమారం బీభత్సం



బెల్లంపల్లి: రామాలయం వెళ్లే వీధిలో విరిగిన వృక్షం



తాండూర్‌లో..



దేవాపూర్‌లో విరిగిన విద్యుత్ స్తంభం

మందమర్రిరూరల్/కాసిపేట/తాండూర్/బెల్లంపల్లి: గాలి దుమారం బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి ఒక్కసారిగా వీచిన గాలి దుమారానికి వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. రోడ్లు, ఇళ్లు, కరెంట్‌తీగలపై చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. బెల్లంపల్లి మున్సిఫ్ కోర్టు పక్క వీధి నుంచి రామాలయానికి వెళ్లే మార్గంలో సింగరేణి కంపెనీ క్వార్టర్ వెనకాల ఓ భారీ వృక్షం రోడ్డుపై పడింది. గాంధీనగర్‌లో ఆరు విద్యుత్‌స్తంభాలు కిందపడ్డాయి. బెల్లంపల్లి బస్తీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముఖద్వారం గోడ పాక్షికంగా కూలిపోగా, పాఠశాల బోర్డు విరిగి కిందపడింది. ఏఎంసీ ఏరియా, షంషీర్ పశువుల సంత ప్రాంతంలో మరికొన్ని చోట్ల కరెంట్‌తీగలపై చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ శాఖ పట్టణ ఏఈ మల్లేశం, సిబ్బంది మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు కరెంట్ తీగలపై విరిగిపడిన చెట్లు, కొమ్మలను తొలగించే చర్యలు తీసుకున్నారు. అర్ధరాత్రి 12గంటల్లో కొన్ని బస్తీల్లో విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించండంతో ప్రజలు కాస్తా ఉపశమనం పొందారు. తాండూర్‌లో విద్యుత్ తీగలపై, స్తంభాలపై చెట్లు విరిగిపడటంతో కరెంట్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది విరిగిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించే చర్యలు చేపట్టారు. కాసిపేట, కోమటిచేను, దేవాపూర్ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పాటు రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. కాసిపేట ముత్యంపల్లి గ్రామాల్లో ప్రధాన రోడ్లపై చెట్లు విరిగి పడగా బుధవారం ఉదయం నుంచి కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ చెట్లను తొలగింపజేశారు. మందమర్రిలో కోల్ బెల్ట్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కింద పడిపోయాయి. మార్కెట్ ఏరియాలోని టీబీజీకేఎస్ ఆఫీస్ వెనుక గల భారీ చెట్టు కుప్పకూలి రోడ్డుకు అడ్డంగా పడడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

నగరపాలక సంస్థ డివిజన్ల మార్పును సవరించాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పాతమంచిర్యాల: మంచిర్యాల నగరపాలక సంస్థ 60డివిజన్‌లలోని మార్పులను సవరించాలని బీజేపీ గర్మిళ్ల జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ శివాజీని కలిసి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. రాబోయే కొత్త డివిజన్‌ల ఏర్పాటులో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గర్మిళ్ల జోన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆకుల అశోకవర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకట కృష్ణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సమ్మర్ క్యాంపు ముగింపు



తాండూర్: మండలంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో నలబై రెండు రోజులుగా నిర్వహిస్తున్న శాస్త్రీయ నృత్య తరగతులు బుధవారం ముగిశాయి. సురభి గోదాక్షేత్ర ఫంక్షన్ హాల్లో సంబురాలు ఏర్పాటు చేయగా చిన్నారులు నృత్యం చేసి అలరించారు. ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ శరత్‌కుమార్, నాట్య గురువు మాచిరాజు రాజేష్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రంగయ్య, జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షులు రాకం సంతోష్, లక్ష్మణ్, రమేశ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భీరన్న నాగవెల్లి

వేమనపల్లి: మండలంలోని కుర్మగూడంలో నిర్వహిస్తున్న భీరన్న దేవుడి వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. భీరన్న–కామేరథిల కల్యాణం మూడు రోజుల క్రితం జరగ్గా బుధవారం నాగవెల్లి నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నిష్టతో భీమన్న దేవుడికి పూజలు

తాండూర్: మండలంలోని మాదారం–3 ఇంక్‌లైన్ గ్రామానికి చెందిన కొలవార్(మస్నేవార్) తెగకు చెందిన గిరిజనుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడికి మంగళవారం రాత్రి భక్తిప్రపత్తులతో ప్రత్యేక పూజలు చేశారు. సాంప్రదాయ వాయిద్యాలతో నృత్యం చేసుకుంటూ ఘనంగా సంబురాలు చేసుకున్నారు. నాయకులు యాపాల సమ్మయ్య, బురుస రమేశ్, మీసాల పోషమల్లు, పూజారి వెంకటేష్, సంతోష్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రథోత్సవంతో ముగిసిన జాతర

వేమనపల్లి: రాజారాం రేణుక ఎల్లమ్మ జాతరతో భక్తజన సంద్రంగా మారింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతలను రథాలపై ఎక్కించి శోభాయాత్ర నిర్వహించారు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు రోజుల జాతర రథోత్సవంతో ముగిసింది.

ఘనంగా గిరి ప్రదక్షిణ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర నరసింహ స్వామి దేవాలయంలో గిరి ప్రదక్షిణ నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు.

శివాలయంలో పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

చెన్నూర్: శివాలయంలో ఏరువాక, వట సావిత్రి పౌర్ణమి సందర్భంగా అర్చకులు మహేశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. పంటలు సంవృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

అడవి ఇబ్బందులపై చైతన్యయాత్ర

జన్నారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్లో బుధవారం మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రజా, కుల సంఘాల సామాజిక కార్యకర్తలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో టైగర్‌జోన్ ఏర్పాటుతో విధించిన ఆంక్షల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై, ఆంక్షలు ఎత్తివేసే వరకు చేసే ఉద్యమాలపై గ్రామాల్లో చైతన్యయాత్రలు నిర్వహించాలని తీర్మానించారు. కమిటీని నియమించారు. కన్వీనర్‌గా కొండయ్య, కో కన్వీనర్లుగా గంగాధర్, లక్ష్మణ్, అశోక్, విజయ్, రవి, భూమాచారి, భూమన్న, ముజఫర్ అలీఖాన్, బద్రీనాథ్, రాజారామ్ రెడ్డి, మల్లేష్‌లను ఎన్నుకున్నారు. పోరాట కమిటీకి ముఖ్య సలహాదారుగా చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నివాళి

నస్పూర్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్‌కు నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో మునీర్ చిత్రపటానికి పూలమాల వేసి బుధవారం నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.